కథ

# బహుమానం

స్వరలాసిక



తలపైనున్న కేప్ తీసి రుమాలుతో నుదుటికి, మెడకు పట్టిన చెమటను తుడుచుకున్నాడు రహమతుల్లా. రోహిణి కార్తె మొదలైంది కాబోలు నిన్నటి కన్నా ఈ రోజు ఎండ ఎక్కువగా వుందని అనుకుంటూ రైల్ థర్మామీటర్‌ను పరిశీలనగా చూశాడు. 'బాప్ రే 60 డిగ్రీలు' అనుకుంటూ గ్యాంగ్ వైపు చూశాడు. అప్పడే భోజనాలు ముగించుకొని చెట్టుకింద సేద తీర్చుకుంటున్నారు గ్యాంగ్‌మెన్లు. ఎండ ఎక్కువగా వుండడంతో రహమతుల్లా పదకొండు గంటలకే పనిని నిలిపివేసి గ్యాంగ్‌తో కంకరను స్లీపర్ల చుట్టూ కప్పించాడు. మరో అరగంట అలా పనిచేయించిన తరువాత గ్యాంగ్‌కు విశ్రాంతినిచ్చాడు. కానీ తను మాత్రం ట్రాక్‌ను వదలలేదు. గ్యాంగ్ చేసిన ప్యాకింగ్‌ను చెక్ చేశాక సంతృప్తి చెందిన రహమతుల్లాకు రైల్ టెంపరేచర్ గాభరా పుట్టించింది.

తన యూనిట్‌లో రైల్వే ట్రాక్ సగం సిమెంట్ స్లీపర్లు, సగం స్టీలు స్లీపర్లు కావడంతో ఇబ్బంది కలుగుతోంది. స్టీలు స్లీపర్ల కింద ఎంత ప్యాక్ చేసినా అట్టే నిలవడం లేదు. సిమెంట్ స్లీపర్లు మార్చే పని సగంలో వదిలేయడం తనకు తలనొప్పిగా మారింది. పైగా బాలాస్ట్ కూడా తక్కువగా వుంది. ఉన్నదంతా బళ్ల రాకపోకల వత్తిడితో మట్టిగా మారింది. బాలాస్ట్ కొరత గురించి తను సెక్షన్ ఇంజనీర్‌కు ఎన్నో సార్లు చెప్పినా ఆ మహానుభావుడి చెవికి సోకడం లేదు. పైగా ట్రాలీపై ఇన్స్‌పెక్షన్‌కు వచ్చిన ప్రతీసారి పని గురించి ఎన్నో వంకలు పెడుతున్నాడు. తన యూనిట్‌లో పేరుకు ముప్ఫై మంది గ్యాంగ్‌మెన్‌లు వున్నా ఎప్పుడూ సగానికి పైగా ఇతర పనులు పురమాయిస్తాడు తన జూనియర్ ఇంజనీర్ లింగారెడ్డి. మిగతా వాళ్లలో లీవు పెట్టిన వాళ్లు, పనికి ఎగనామం పెట్టిన వాళ్లు పోను రోజూ గ్యాంగ్ బలం ఏడెనిమిది మంది కంటే మించదు. ఇంత తక్కువమందితో పని నెట్టుకు వస్తున్నా పై అధికార్ల నుంచి మాటలు తప్పడం లేదు. ఆలోచనల నుంచి తేరుకొని రహమతుల్లా రైలు కమ్మీల వంక చూశాడు.

''మొఖద్దం'' రహమతుల్లా పెట్టిన గావుకేకకు వెంకటయ్య ''ఏమయింది దొరా!'' అని పరిగెత్తుకుంటూ రైలు కట్ట ఎక్కాడు. ''బావుటాకు మనిషిని పంపు'' తన సూపర్‌వైజర్ ముఖంలో ఆందోళనను పసిగట్టి రైల్వే లైన్ వంక చూశాడు. లైను పాములా మెలికలు తిరిగి వుంది. వెంకటయ్యకు పరిస్థితి అర్థమయ్యింది. వెంటనే రామయ్యను కేకేసి తన సంచిలో నుంచి ఎర్ర చేతి బావుటా, డిటోనేటర్లను తీసి ఇచ్చి, ''ఏపి ఎక్స్‌ప్రెస్ బెల్లంపల్లి వదిలి వుంటుంది పరిగెత్తు'' అన్నాడు. రామయ్య చేతిలో రెడ్ ఫ్లాగు పట్టుకొని దౌడు తీసాడు. వెంకటయ్య మిగతా గ్యాంగును లేపి పనులు పురమాయించసాగాడు. బ్యానర్ ఫ్లాగును సిమెంటు కర్రల వద్ద లైన్‌కు అడ్డంగా పాతాడు. బక్లింగ్ గురించి రహమతుల్లా ట్రైనింగులో చదవడమే కానీ ప్రత్యక్షంగా చూడడం ఇదే మొదటిసారి. సుమారు అర కిలోమీటరు ట్రాక్ వంకలు తిరిగి పైకి లేచి వుంది. చూస్తూ వుంటే కాళ్లు చేతులూ వణకసాగాయి. వెంటనే తేరుకొని ముందు రాబోతున్న ఎక్స్‌ప్రెస్‌ను ఆక్సిడెంటు కాకుండా కాపాడాలి. తరువాతే మరేదైనా అనే స్థిర నిశ్చయానికి వచ్చాడు. ఏపి ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే దాటి పోవలసి వుంది. ఎక్కడకు వచ్చిందో? బెల్లంపల్లి వదిలిందో లేదో స్టేషన్ మాస్టారికి వెంటనే సమాచారం అందివ్వాలి. జేఇ లింగారెడ్డికి కూడా తెలపాలి. సిగ్నల్స్ లేక సెల్‌ఫోన్ పనిచేయడం లేదు. గేట్‌కు ఎవరినైనా పంపి స్టేషన్‌కు ఫోన్ ద్వారా సంగతి తెలపాలనుకున్న రహమతుల్లా మనసు మార్చుకొని తానే గేట్‌కు వెళ్లాలని నిర్ణయించుకొని లింగయ్యను వెంటబెట్టుకొని గేట్ వైపు పరుగు తీశాడు. ఇంతలో దూరంగా ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ రావడం కనిపించింది.


చేతిలో ఎర్రబావుటా పెట్టుకొని పరిగెత్తుతున్న రామయ్య సుమారు ఆరు వందల మీటర్ల దూరంలో మూడు డిటోనేటర్లు పెట్టాల్సి వుంది. ఐతే ఎదురుగా బండి వస్తుండడం గమనించి అక్కడే ఆ డిటోనేటర్లను పాతి బండికెదురుగా ఎర్రజెండా పైకి ఎత్తుకొని పరిగెత్తసాగాడు.


''బానర్ ఫ్లాగ్ ఆహెడ్'' అసిస్టెంట్ డ్రైవర్ శ్రీధర్ అరుపుతో అప్రమత్తమైన డ్రైవర్ జాన్ ''రైట్'' అంటూ వాక్యూమ్ రిలీజ్ చేశాడు. ఎదురుగా రెడ్‌హేండ్ సిగ్నల్ ఫ్లాగ్‌తో పరిగెత్తుకొస్తున్న వ్యక్తిని చూసి హారన్ కొట్టాడు. బండి దగ్గరకు రాగానే రామయ్య పక్కకు తప్పుకున్నాడు. జాన్‌కు ముందు కనిపిస్తున్న దృశ్యం దడపుట్టించింది. 'ముందు ట్రాక్ బాగా డామేజయింది. డాసర్ ఫ్లాగ్ పెట్టారు' గార్డుకు వాకీటాకీలో చెబుతున్నాడు శ్రీధర్. ఠాప్ ఠాప్ మంటూ డిటోనేటర్లు పేలి బాసర్ ఫ్లాగ్‌ను తొక్కి రెండు మీటర్ల దూరంలో ఇంజను ఆగింది. థాంక్‌గాడ్ అనుకుంటూ జాన్ ఊపిరి పీల్చుకున్నాడు. మరో రెండు మూడడుగులు ట్రైన్ పాసయి వుంటే పెద్ద ప్రమాదమే జరిగి వుండేది.

రహమతుల్లా ఇంజను దగ్గరకి పరిగెత్తి డ్రైవర్‌కు పరిస్థితిని వివరించాడు. తనపై అధికార్లకు విషయం తెలపడానికి గేట్ దగ్గరకు వెళుతున్నానని, ట్రాక్ సరి చేయడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేమని, ఇంతలో డౌన్ లైన్లో ఏదైనా ట్రెయిన్ వస్తే వాకీటాకీ ద్వారా ఆ ట్రైన్ డ్రైవర్ ద్వారా స్టేషన్‌కి కబురు పెట్టమని చెప్పి గేట్ వైపుకు పరిగెత్తసాగాడు. ఈ పానెల్‌ను డీ స్ట్రెస్సింగ్ చేయ్యాలని గతంలో రెండు మూడు సార్లు లింగారెడ్డికి చెప్పడం, అతను తాత్సారం చెయ్యడం రహమతుల్లాకు గుర్తుకు వచ్చింది. అదే జరిగి వుంటే, ఈ రోజు బక్లింగ్ అయ్యేదే కాదు. గేట్ సమీపించడంతో రహమతుల్లా ఆలోచనలకు బ్రేక్ పడింది. సూపర్‌వైజర్‌ను చూడగానే గేట్ మాన్ కొమరయ్య 'నమస్తే సార్'అన్నాడు. రహమతుల్లా బదులుగా తల ఊపుతూ గదిలో వున్న ఫోన్ తీసుకొని రేచిని స్టేషన్ మాస్టారితో మాట్లాడసాగాడు.

''సార్ నేను పివే సూపర్‌వైజర్ రహమతుల్లా, టూ ట్వంటీసిక్స్ కిలోమీటర్ అప్ లైన్లో ట్రాక్ బక్లింగ్ జరిగింది. ఏపి బాసర్ ఫ్లాగ్‌పై ఆగింది. జేఇ గారిని వెంటనే నాతో మాట్లాడమనండి. నేను గేటు వద్దే వుంటాను. అలాగే బెల్లంపల్లిలో సెక్షన్ ఇంజనీర్‌కు ఇన్ఫార్మ్ చేయండి. ట్రాక్ ఈజ్ సస్పెండెడ్ అన్టిల్ ఫర్దర్ అడ్వైజ్''అంటూ గబగబా చెప్పి ఫోన్‌పెట్టేశాడు.

ప్రస్తుతం బ్లాక్ స్మిత్ వచ్చి రైలును కట్ చేసే వరకు ఏమీ చేయలేము. హాక్ సా బ్లేడ్లతో రైలు



తెగేటట్లు కనిపించడం లేదు. గ్యాస్ కటింగ్ చేయాలి. గ్యాస్ కటింగ్ సామాగ్రి బెల్లంపల్లి నుంచి రావాలి. చాలా సమయం పడుతుంది. ఈ లోగా ప్రత్యామ్నాయం ఆలోచించాలి.

''జంగయ్యా ఇక్కడ దగ్గరలో గ్యాస్ వెల్డింగ్ చేసే షాపుందా?''

''రేపల్లెవాడలో వుండొచ్చు సార్ చూసివస్తాను.''

''ఉంటే ఆ వెల్డర్‌ను వెంటనే పిలుచుకురా! కట్టర్‌ను తీసుకు రమ్మను. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. ఇదిగో ఈ వంద రూపాయలు అడ్వాన్స్‌గా ఇవ్వు. మిగతా సొమ్ము సార్లతో ఇప్పిద్దాం.''

జంగయ్య గేట్‌మాన్ కొమరయ్య సైకిల్ వేసుకొని వూరిలోకి వెళ్లాడు. ఈ లోగా ఫోన్ మోగింది. లింగారెడ్డి లైన్లోకి వచ్చాడు. రహమతుల్లా పరిస్థితిని వివరించాడు. వెంటనే కనీసం రెండు గ్యాంగ్‌లను, కమ్మరి మేస్త్రీని పంపాలని చెప్పాడు. బెల్లంపల్లి నుంచి గ్యాస్ కటింగ్ పరికరాలను తెప్పించమని అడిగాడు.

''నేను వెంటనే బ్లాక్ స్మిత్ స్టాఫ్‌ను తీసుకొని ట్రాలీలో వస్తున్నాను. మూడో యూనిట్‌కు కబురు పెట్టాను. మరో పదినిమిషాల్లో అక్కడ వుంటారు. బెల్లంపల్లి నుంచి ఎస్ఇ, ఎడిఇ మోపెడ్ ట్రాలీలో వస్తున్నారు. గ్యాస్ కటింగ్ ఎక్విప్‌మెంట్ తెస్తున్నారు. రాజధాని ఎక్స్‌ప్రెస్ ఇక్కడ రేచినిలో ఆగిపోయింది. బెల్లంపల్లిలో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వుంది. మనం వెంటనే ట్రాక్‌ను క్లియర్ చేయాలి. లేకపోతే మనకు తిట్లు తప్పవు.'' రహమతుల్లాకు అంత టెన్షన్లోనూ లింగారెడ్డి మాటలు నవ్వు తెప్పించాయి. అక్కడిక ఏదో తనే కావాలని ఆలస్యం చేస్తున్నట్లు.


స్పాట్‌కు చేరిన రహమతుల్లాకు బీటర్లతోనూ, గునపాలతోనూ రైలుకున్న క్లిప్పులను ఊడబెరకడానికి తంటాలు పడుతున్న గ్యాంగ్‌మెన్లు కనిపించారు. మరో నలుగురు గ్యాంగ్‌మెన్లు బకెట్లలో నీరు తెచ్చి రైలు కమ్మీలపై వరసగా పోసుకుంటూ వాటిని చల్లబరచడానికి ప్రయత్నిస్తున్నారు. వెంకటయ్య మొఖద్దం గతంలో చాలా సార్లు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవంతో నిశ్చల చిత్తుడై గ్యాంగ్‌తో పనిచేయిస్తున్నాడు.


ఈలోగా గ్యాస్ కటర్ కోసం వెళ్లిన జంగయ్య సైకిల్‌పై వేగంగా వచ్చాడు. వెల్డర్ దొరికాడు కానీ అతని దగ్గర గ్యాస్ అయిపోయిందని చెప్పాడు. ''జంగయ్యా! వెంటనే ఆ వెల్డర్‌ను సామాన్లతో ఇక్కడకు పంపు. నీవు మా ఇంటికి వెళ్లి అమ్మనడిగి గ్యాస్ బండ పట్టుకుని వచ్చేయి. నిన్ననే కొత్తది వచ్చింది. తొందరగా వెళ్లు.'' తరిమాడు రహమతుల్లా. తన రైల్వే క్వార్టర్స్ సుమారు ఐదుకిలోమీటర్లు వుంటుంది. జంగయ్య రావడానికి మరో పావుగంట పట్టవచ్చు. ఈలోగా చేయవలసిన పనుల గురించి ఆలోచించసాగాడు.

ఏపి ఎక్స్‌ప్రెస్ ఆగి అప్పటికే చాలా సేపయింది. ఎందుకు ఆగిందో తెలుసుకోవడానికి ఒక్కొక్కరే ట్రైన్ దిగి ఇంజన్ వద్దకు రావడం ప్రారంభించారు. పెద్ద ప్రమాదం తప్పిపోయిందని తెలియడంతో వారిలో కలకలం రేగింది. గ్యాంగ్ పనులకు ఇబ్బంది కలగకుండా వారిని అదుపు చేయడానికి అవస్థలు పడుతున్నారు అసిస్టెంట్ డ్రైవర్ శ్రీధర్, గ్యాంగ్‌మాన్ రామయ్యలు. డౌన్ లైన్లో బండి రావచ్చని అటువైపు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. వద్దని వారిస్తున్నా రామయ్య, శ్రీధర్ చేతుల్లో కొందరు ప్రయాణీకులు తమ ప్రాణాలను కాపాడారని బహుమతిగా కొంత పైకం బలవంతంగా కుక్కారు.

దూరంగా ట్రాలీ కనపడడంతో రహమతుల్లా ఊపిరి పీల్చుకున్నాడు. జెఇ లింగారెడ్డి వచ్చేసరికి జంగయ్య గ్యాస్ సిలిండర్‌తో, వెల్డర్‌ను వెంటబెట్టుకొని వచ్చాడు. ఇంతలో మరో గ్యాంగు కూడా అక్కడకు చేరుకుంది. లింగారెడ్డి ఆ గ్యాంగును రైలు క్లిప్పులను ఊడగొట్టమని పురమాయించాడు. కమ్మరి మేస్త్రీ యాదగిరికి వెల్డర్‌ను అప్పజెప్పి రైలును రెండువైపులా అరమీటరు కట్ చేయడానికి రైలుపై గుర్తులు పెట్టాడు లింగారెడ్డి. ఒక వైపు గ్యాస్ కటర్‌తో రెండు కోతలు పెట్టి విరిగిన రైలుముక్కను బయటకు తీయడానికి యాదగిరి తన కళాసీలతో పెద్ద సుత్తితో కొట్టించాడు. అంత బరువున్న రైలు ముక్క దూరంగా ఎగిరి పడింది. రైలు క్లిప్పులను ఊడబెరికి ఉన్నందువలన రైలు బుస్ మంటూ పొంగి కొంచెం కూడా సందులేకుండా మళ్లీ అతుక్కుపోయింది. రెండో వైపు కూడా అలాగే రైలును కత్తిరించాడు యాదగిరి వెల్డర్ సాయంతో. ట్రాక్‌లో స్ట్రెస్ అంతా పూర్తిగా విడుదల కాలేదని నిర్ధారించుకున్న లింగారెడ్డి మరో అరమీటరు కత్తిరించమని యాదగిరిని ఆదేశించాడు.

డౌన్‌లైన్లో రాంగ్‌రూట్లో రాజధాని ఎక్స్‌ప్రెస్ హారన్ కొట్టుకుంటూ రావడం చూసి అందరూ పక్కకి జరిగారు. మెల్లగా వచ్చి స్పాట్‌లో ఆగింది. ఇంజన్‌లో నుంచి సెక్షన్ ఇంజనీరు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు దిగారు. వెనక బోగి నుంచి ట్రాలీమెన్లు మోపెడ్ ట్రాలీని, ఇతర సామాన్లను దింపాక రాజధాని మెల్లగా కదిలింది. రహమతుల్లా, లింగారెడ్డి తమ అధికార్లను విష్ చేశారు. అప్పటికే గ్యాస్‌తో రైలు కట్ చేయడం గమనించి సెక్షన్ ఇంజనీర్ వర్మ మొఖం వెలిగిపోయింది. బయట నుంచి గ్యాస్ కటింగ్‌ను సమకూర్చింది తమ సూపర్‌వైజర్ రహమతుల్లా అని తెలుసుకొని అతని వైపు ప్రశంసాపూర్వకంగా చూశాడు. త్వరగా పని పూర్తి అయ్యేటట్లు చూడమని తన జూనియర్



## ప్రియాతి 'అప్రియం'

సినీరంగంలో గాసిప్స్‌ని నమ్మినట్టుగా ఎవరూ నిజాలను నమ్మరు. తారల మధ్య వ్యవహారాలకు కొత్త భాష్యం చెబుతూ మీడియా సరి కొత్త కథనాలను అందిస్తే ఆనందమే ఆనందం. నిర్మాత జికె రెడ్డి తనయుడు, వర్ధమాన నటుడు, పందెంకోడి హీరో విశాల్ ఇప్పుడు వార్తల్లో వ్యక్తిగా మారాడు. ఓ హీరోయిన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడని పత్రికల్లో వార్తలు రావడం, ఆతర్వాత వేలంటైన్స్ డే గురించి విశాల్ మాట్లాడడం మరిన్ని గాసిప్స్‌కి అవకాశం ఇచ్చినట్టు అయింది. ఇంతకీ ఆ భామ ఎవరో అని ఆలోచిస్తే ప్రియమణి అని గుసగులాడారు. 'మలైకోట్టై' చిత్రంలో విశాల్‌తో ఆమె కలిసి నటించడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ఇదిలా వుంటే 'ఆ అమ్మాయికీ నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఆమె నాతో కలిసి నటించడం తప్ప వేరే ఏదీలేదు' అంటూ వ్యాఖ్యానించాడు విశాల్. ప్రియమణి కూడా 'మేమిద్దరం మంచి మిత్రులం' అని మీడియా గాసిప్స్‌ని కొట్టిపారేసింది.



లింగారెడ్డిని ఆదేశించాడు.

తాను చెప్పినట్లు యాదగిరి మరో అరమీటరు మేర రైలును రెండువైపులా కత్తిరించాడని తెలుసుకున్న లింగారెడ్డి వెంటనే రహమతుల్లాకు చేయాల్సిన పనులు గూర్చి వివరించి త్వరగా పూర్తి చేయాలని కోరాడు. రహమతుల్లా ఆదేశం మేరకు నలుగురు గ్యాంగ్‌మెన్లు ఆ చివరి నుంచి ప్రతి మూడో స్లీపరుకు రైలు క్లిప్పులను బిగించుకుంటూ వచ్చారు. వారి వెనకనే మిగతా గ్యాంగుతో రహమతుల్లా కచ్చాపక్కాగా పాకింగ్ చేయించసాగాడు. రైలు కత్తిరించిన చోట సుమారు ఎనిమిది అంగుళాల గ్యాప్ వుండడంతో ఆరు అంగుళాల రైలు ముక్కలను రెండు వైపులా వుంచి ఫిష్ ప్లేట్లను క్లాంపులను గట్టిగా బిగించాడు యాదగిరి. బండిని సురక్షితంగా పంపవచ్చన్న నిర్ణయానికి వచ్చిన ఎస్ఇ వర్మ ట్రాక్ ఫిట్ సర్టిఫికెట్ రాసి డ్రైవర్ జాన్‌కు ఇచ్చాడు. రైలుబండిని స్టార్ట్ చేయబోతూ సూచనగా హారన్ మోగించాడు డ్రైవర్. కిందకు దిగిన ప్రయాణీకులందరూ ట్రైన్‌లోకి గబగబా ఎక్కసాగారు. మెల్లగా కదిలిన ఏపి ఎక్స్‌ప్రెస్‌ను చూసి చాలా తక్కువ సమయంలో ట్రాక్ సరిచేయగలిగినందుకు సంతోషించాడు రహమతుల్లా, లింగారెడ్డి.

ముప్పై కెఎంపిహెచ్ కాషన్ ఆర్డర్ ఇంపోజ్ చేస్తున్నానని, పూర్తిగా క్లిప్‌లను బిగించి అలైన్‌మెంట్ వగైరా సరిచూసుకొని మరోసారి గట్టిగా పాకింగ్ చేయించమని, గ్యాస్ కటింగ్ చేసిన భాగాన్ని హాక్ సా బ్లేడుతో కట్ చేసి ఆరుమీటర్ల కట్ రైలును మార్చమని, రేపు డీ స్ట్రెసింగ్ ప్లాన్ చేసి కట్ రైలును వెల్డింగ్ చేయించమని, ఆ తరువాత కాషన్ ఆర్డర్‌ను రిలాక్స్ చేయమని లింగారెడ్డికి ఆదేశాలు జారీచేశారు ఎస్ఇ వర్మ. ఏడిఇ మెహతా. తక్కువ సమయంలో చురుకుగా వ్యవహరించి ప్రమాదాన్ని నివారించినందుకు వెంటనే ట్రాక్ రిపోర్టు చేయగలిగినందుకు మెహతా గ్యాంగును, సూపర్ వైజర్ను, జేఇని అభినందించాడు. సూపర్‌వైజర్ రహమతుల్లా పేరును రైల్వే బోర్డు అవార్డు లేదా జనరల్ మేనేజర్ అవార్డుకు సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చి ఎస్ఇతో కలిసి మోపెడ్ ట్రాలీలో వెనుదిరిగాడు.

తన సహచరుల ప్రశంసలతో కించిత్ గర్వపడిన రహమతుల్లా మరుసటిరోజు డివిజనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన లెటర్ చదివి అవాక్కయ్యాడు. పనిలో నిర్లక్ష్యం చూపి అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు పలు స్టేషన్లలో నిలిచిపోయి ప్రయాణీకుల అసౌకర్యానికి కారణమైన తనపై ఎందుకు చర్య తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వవలసిందిగా పై అధికారులుపంపిన శ్రీముఖం అది. పెద్ద ఆక్సిడెంటు కాకుండా తను పడిన శ్రమకు తగిన ప్రతిఫలం లభించిందని చిన్నగా నిట్టూర్చాడు రహమతుల్లా.

★

